రాయి మీద రాయిపడితే, రెండు రాళ్ళు ఢీకొంటే, రాళ్ళన్నీ దడదడామని లారీలోంచి క్రిందకు జారితే అవి మూలస్వరూపాన్ని మార్చుకుని భూమాత ఒడిలోకి జారినందుకు గోల చేస్తున్నాయా?

చెట్టు పడిపోయినప్పుడు మీకు కలిగే దుఃఖం ఓ కంపెనీ పడిపోయినప్పుడు కలిగే దుఃఖం కంటే ఎక్కువ కాదా?

మీకు తెలుసోలేదో సృష్టిలో బేలన్సింగ్ (సమతూకం) వుందిగానీ లాభనష్టాల పట్టీలేదు. ప్రకృతిలో ట్రయల్ బేలన్సుంది.

మనం మురళి. ఫిడేలు, వీణ, హార్మనీ, సితార, మృదంగం, తబల క్లారినెట్, తంబూర, మౌత్ ఆర్గన్, యింకా ఎన్నో రకాల వాయిద్యాలుచేసేసంగీత ధ్వనులను కర్ణపేయంగా ఆలకిస్తాము. ఆలోచిస్తే యీ ధ్వనులన్నీ ఎక్కడ దాక్కొని వున్నాయి? ఇవన్నీ ఎక్కడినుంచి పుట్టుకొస్తున్నాయి. ఈ పాడిన పాటలు, ఈ సంగీతాలు, ఈ కచేరీలు అయాక ఎక్కడో ఓక్కడ దాక్కోవాలికదా? పాట కచ్చేరీలు సోలో కచ్చేరీలు యీ అనంత విశ్వంలో గాలిలో కలిసిపోయివుంటాయా? వీటి జమాఖర్చులూ, లాభనష్టాలూ ఎవరు చూస్తారు?

ధ్వని లేనిచోటు, అంతా కాంతి తప్ప మరింకేమీ లేనిచోటు అనేది వుంటుందా? లేక అంతయూ యింతకీ నాన్సెన్సేనా?

సృష్టిలో ధ్వనుల్ని నిబద్ధం చేయడం సంగీతశాస్త్రమా? ఓం కారంలోంచి అంతా వచ్చిందని మనవాళ్ళు దబాయిస్తారు. ఓం కారంలోంచి కాక యిప్పుడన్నీ అహంకారం లోంచివచ్చాయని నా కనిపిస్తోవుంటుంది.

నిద్రపోతున్న మృదంగాన్ని, పెట్టెల్లో దాక్కున్న హార్మణీ, ఫిడేలు వీణల్ను చూస్తే మీకేమనిపిస్తుంది?

ఇవన్నీ తీగలూ చెక్కలూ లక్కలూ అంతేగా - మరి మనం మాత్రం - నిమిత్త మాత్రులం - మరియిందులోంచి యీ సృష్టి విలాసాన్ని గానం చేస్తూ యిన్ని విద్యలు ఎక్కడ్నుంచి వచ్చాయి - భగవంతుని నోట్లోంచా - మానవుని శ్రమ శక్తిలోంచా? బాబోయ్ కారల్ మార్క్స్ బాబాయి గారు చెప్పిందే రైటు ఆలోచించండి;

# 'జవానీ కి రైల్'

వసంతాలు మళ్ళీ మళ్ళీ వస్తూ వుంటాయి. కోయిల్లు కూస్తుంటాయి. అవే మావిచిగుళ్ళు, అవే మందమలయానిలాలు - అదే సెలయేటి గానం - మనకి ఎప్పటికప్పుడు కొత్తగా అనిపించేవన్నీ పాతవే... చంటి పిల్లల బోసి నవ్వులు, చిన్నపిల్లల గంతులూ, అల్లరీ, ఆటలూ - చూసినవీ, విన్నవీ ఎందుకు మనకింత హుషారిచ్చి ఆనందాల్ని కలిగిస్తాయ్? మల్లెపూల

వాసనలకు ఎలా ప్రతిస్పందిస్తామో అల్లాగే కొడివాడి పకోడీల ఘుమఘుమలకూ – కొత్త బట్టలు వేసుకున్నా అదే ఆనందం – వీటికి వేటికీ చలించని వాళ్ళు కొందరుంటా రనుకోండి. ఎప్పుడూ ఏడుపు మొహాలే వాళ్ళ వూసు మనకెందుకుగాని – ఈ ఆనందాశ్చర్యాల సంగతుల లిస్ట్‌లోకి నవ దంపతులు కూడా వస్తారని నేనుకుంటాను. కొత్తావకాయ నిజంగా మన మనసులో అది చేసే వంచనతో కొత్తావకాయగాని. నిజానికి అది పాతదే. అలాగే అన్నీనూ – సంసారం అనేది ఎన్ని జన్మల సంగతి – అయినా ఈ సంసారం ఎల్లవేళలా కొత్తగానే వుంటుంది. వెండి కంచంలో పాలోస్తే అందులోకి చందమామ తొంగి చూస్తే – చందమామ కాకపోతే అంతకంటే అందమైన మంచి పాపాయి తొంగిచూస్తే... తొంగి చూడడమే కాదు బోసినవ్వులు అందులోకి విసిరేస్తే – ఎల్లా వుంటుంది? భద్రాచలం రామాలయం పెళ్ళి పందిట్లో అమ్మవారూ, స్వామివారూ తలంబ్రాలు పోసుకున్నాక 'జానక్యాం కమలామలాంజలి పుటే' లు దొర్లినవి. ఆ దొర్లిన ముత్యాల్ను ఏరుకుంటూవుంటే ఎలా వుంటుందో అలా వుంటుంది. మొత్తం జీవిత మంతా ఒక పరమేశ్వరుని మందహాసం అయితే – ఆ మందహాసం చిలికే అమృత బిందువుల్లోని సింధువులాటి వాళ్ళం మనం. కిలం పట్టిన ఇత్తడి గిన్నె కూడా చింతపండెట్టి తోమితే 'నన్ను చూడు నా అందం చూడు'అన్నట్లు ప్రకాశిస్తుంది. మనమూ మన అంత రంగాలూ ఆ పాటి చెయ్యవా? తోమేవాడుంటే మనవూ మెరుస్తాం? ఉత్తుత్తి మెరుపులు కాదు, జగన్నాథుడిచ్చే మెరుపు, సర్వము తానయైన వాడిచ్చే మెరుపు. పైన మెరిస్తే ఏవిలాభం? లోపల మెరవాలి! ఈ అంతరంగ మథనం బోరుకొడ్తోందా? చిత్తచిత్తం – బోరుకొట్టని సంగతులకు పయనిద్దాం! ఛల్!ఛల్! గుర్రం – చలాకి గుర్రం – గుర్రవే పరుక్కి ప్రమాణం – హార్స్ పవర్ అన్నారు కాని కుక్క పవరూ, నక్క పవరూ అన్లేదు కదా! పిల్లి పరుగెత్తే వేగాన్ని పిల్లి పవరూ పిచిక పరుగెత్తే వేగాన్ని పిచిక పవరూ అని ఎందుకనలేదబ్బా – వేగానికి గుర్రవే ప్రమాణం కాబోలు! ఈ అశ్వ ఘోషని అలా వుంచి మావిడి చెట్టును గురించిన ఉపన్యాసం ఆపుచేసి మావిడి కాయో, పండో తినేద్దాం. మనం కాయో పండో అంటామా – ఇంగిలీజులు 'ఫ్రూట్ ఫుల్' అని ఫలసంగతిని చెప్తారు. మన 'కాయో–పండో' వాళ్ళ 'ఫ్రూట్ ఫుల్' కంటె ముందుంటుందను కుంటా. 'కాయా, పండా నెరజాణా' అంటాడో స్కవుండ్రల్ ఓ సినిమాలో... సినిమాల్లో స్కవుండ్రల్సూ, భూమ్మీద రాస్కెల్సూ వుంటారు జాగ్రత్త!

ఈ మధ్య ప్రయాణాల్లో నవనవలా దంపతుల్ని చూసి స్టన్నయి పోయాను. అసలు కొత్తగా పెళ్ళయిన వాళ్ళని చూస్తుంటే – ప్రపంచంలోకెల్ల ఆది దంపతులు వీళ్ళే అయినట్లు చుట్టూ వున్న ప్రపంచం లేనట్లూ బిహేవు చేస్తూ వుంటారు. ఈ చరాచర సృష్టికోటితో నిండి వున్న జగత్తు సర్వమూ వారిద్దరికీ లేదు – అంటే లేనట్లుగా వుంటుంది. పార్వతీ పరమేశ్వర్లూ, సీతారామ్లూ, సుందరీ సుబ్బారావులూ వాళ్ళకి వాళ్ళే అన్నట్లుగా వుంటారు. ఎలా వుంటారబ్బా అంటే అదంతా ఓ అల్లం మురబ్బా – మా చిన్నప్పుడు వీథుల్లో సాయిబులు 'అల్లం మొరబ్బా' ని తెచ్చి అమ్మేవారు. అవి చిన్న చిన్న పలకలుగా పంచదార అద్దినవి బహు రుచిగా

జగజ్జేగీయమానంగా వుండేవి. ప్రేమ అలాటిది. ప్రేమించినప్పుడు అల్లం మురబ్బాలా, మరొకప్పుడు పీచు మిఠాయిలా, తదనంతరం మామిడి తాండ్రలానూ మనకి ఏది ఇష్టమైతే అది – యద్భావం తద్భవతీ, అస్సలీ న్యూసెన్సంతా మనస్సు వల్లనే కదా! బ్రదర్సూ మరియు సిస్టర్సూ –

ఈ కొత్త దంపతులు కోవాబిళ్ళల్లా కొబ్బరి మీగడలా, జున్ను ముక్కల్లా జీవితాన్ని నంజుకుని పంచుకుని తింటూన్నట్లు కనిపిస్తారు. జీవితం అనుభవించేవాళ్ళదే – లడ్డూ తినేవాడిదే అయినట్లు. దీనికి మళ్ళీ విపర్యయం లాంటిది వుండేడిసింది. మంచం అల్లినవాడే మంచం మీద పడుకోడు. ఇల్లు కట్టినవాడు నిజంగా ఆ ఇంట్లో వుండడు. గడ్డం గీసేవాడు వూరందరికి క్షవరాలు చేస్తాడు గాని తనకు తాను చేసుకుంటూ కూచుంటాడా? కూచోడు – ఈప్రపంచకం యావత్తు తనకుమాలిన ధర్మం మీద నడుస్తోంది.

ఈ మధ్య మేం ప్రయాణం చేస్తూంటే రైల్లో ఒకావిడ ఆ బెర్తు నా కక్కర్లేదు – మీ రెవరైనా తీసుకోండి. నేను వచ్చి మీ బెర్తులో పడుకుంటాను అని పట్టుబట్టింది. ఏవిటి మీకు వచ్చిన డేంజరు అని అడిగా. ఆ పక్క బెర్తులో నవదంపతులున్నారు – నేనెందుకక్కడ, వాళ్ళకి న్యూసెన్స్‌గా అన్నారావిడ. కాని, ఆవిడ న్యూసెన్స్ అయితే మనం మటుకు ఆ బెర్త్ పక్కన చేరితే వాళ్ళకి న్యూసెన్స్ అవదా? అయితే 'వదినగారు! – అవన్నీ మీకు ఇష్టం లేదా?' అని అడిగా. ఆవిడ అప్పుడే అప్పడం నవిలి దాని ఆనందాన్ని జుర్రుతున్నట్లుగా – 'వాళ్ళకి మనవెందుకక్కడ అడ్డూ–' అని పడిపడి నవ్వింది. సరె – ఆవిడకు అక్కర్లేని బెర్త్ మీదకు నే వెళ్ళాను. ఆ అమ్మాయి మంచి జబరుగా, అందంగా, మెజిస్టిక్‌గా వుంది. ఆ అబ్బాయి కూడా సూటులో వున్నాడు. వాళ్ళ చుట్టూ చాలా లగేజి వుంది. సంచీనిండా కమలాపళ్ళూ, మరో సంచీలో తిండీ సామానూ, సూయింగ్ మిషనూ – కొత్త సంపారం ఊబిలోకి దిగుతున్న తెలివైన వాళ్ళులా కనిపించే తెలివితక్కువ వాళ్ళలా వున్నారు. ఈనాటి తెలివితక్కువవాళ్ళే రేపటి సంసారులని నాకనిపించింది. ఇంకా రాజూ రాణీ జాకీ దాకా రాలేదు. డైమన్ ఆసూడైమన్ పదిలా వున్నారు. చెయ్యకూడనివి, చెయ్యవలసినవీ ఏవీ చెయ్యకుండా మాటల్తో చిన్నచిన్న జెస్చర్స్‌తో ఆ నవమోహనాంగిని 'ఎంటర్‌టైన్' చేస్తున్నాడు– పెళ్ళికాకముందు ఆడపిల్లని ఎంటర్‌టైన్ చెయ్యడం వేరు, పెళ్ళయాక అవన్నీ ఉచిత కిస్సులూ వగైరా పొందడం వేరూ, పెళ్ళయాక తీసుకునేవి అసలైన సంగతులు కాగా – పెళ్ళికి ముందువి బోనస్సులాంటివి. కొన్ని కంపెనీల్లో బోనస్సులు ముందూ, అసలు జీతాలు తరువాత వచ్చినట్లు పెళ్ళికి ముందనీ, తరువాత లాగించేవీ యిదంతా డబులెంట్రీ బుక్కీపింగులా విడమర్చి చెప్పడం కష్టం.

మనల్ని ఓ చింతపండు బుట్టలా ఇగ్నోర్ చేసి వాళ్ళ మానాన్న వాళ్ళుండడమే – నాబోటి చూసే పక్క బెర్త్ వాళ్ళకి కష్టంగా వుంటుంది. మన వయసూ, మనం జుట్టుకి రంగెయ్యడం, మన కళ్ళజోడూ, లావవుతున్న చెంపలు, బిగుసుకున్న మెడ ఇవన్నీ మళ్ళీ మళ్ళీ గుర్తుకొచ్చి మన సొంత నరకం మనకు ప్రారంభమవుతుంది. పోయిన యవ్వనం, దాని విలాసం రైలు

పెట్టెలో ఎక్కడ వెతుక్కోను? ఇదన్నమాటనాకు బెర్తును ట్రాన్స్‌ఫర్ చేసిన వదినగారి ఆంతర్యం! పై బెర్తుమీద ఆ కుర్రాడు, క్రింద బెర్తుమీద ఆ అందాల భరిణ, వారి కువకువలు, బిలబిలలు, గిలగిలలు భరించలేక - వాళ్ళ తలాటి దిక్కుకు నా కాళ్ళు జాపి బరంపురం శాలువా ముఖం మీదకు లాక్కుని చపలచిత్తాన్ని జోకొట్టి నిద్ర లోకి జారా - రీ ఎలర్టు చేయడానికి యవ్వన విలాసం పర్మిషనివ్వదు కదా!

మరోసారి పట్టపగలే - ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఎర్రచీవల పుట్టలా వుంది. అందులో యిద్దరు తగిలారు. వాళ్ళ కళ్ళల్లో మైకం చిందులేస్తోంది. బోగీ టి.టి.ఇ వాళ్ళకి సీటివ్వను పొమ్మన్నాడు. ఆ అభ్యంతరాన్ని వాళ్ళు శృంగార నైషధంగా మార్చుకున్నారు. కొంతసేపు ఒకరిమీదొకరు వాలిపోయి స్వర్గానందాన్ని పొందాక, యియర్ ఫోన్లు తగిలించుకుని పాటల్ని వింటూ, ఆ యిరుకు పెట్టెని 'బృందావన మది అందరిదీ' అన్నట్లు మార్చేశారు. అన్‌కన్‌సర్న్‌డ్‌గా వాళ్ళ ప్రపంచంలోకి వాళ్ళు వెళ్ళిపోవడం - 'చల్ మోహనరంగా' అన్నట్లుంది. కాని, అలా వెళ్ళగలిగే యోగం మనకెవరికీ పట్టదు. దానికి అదృష్టముండాలి! జైహింద్!

# వదినగారి ఒడ్డాణ్ణం

తెలుగువారికి 'కంటె'లాగ 'ఒడ్డాణ్ణం' కూడా చాలా యిష్టమైన నగ. కంటెల్లో గుల్లకంటె అని గట్టికంటె అని వున్నట్లు ఒడ్డాణ్ణాలలో వంకీల మువ్వల ఒడ్డాణ్ణం సాదారేకు ఒడ్డాణ్ణం అని రెండు రకాలున్నాయ్. అల్లాగే కాళ్ళకు కడియాలు గొలుసులు పట్టాలు అవి వుండేవి. చేతులకి మురుగులు మళ్లా కడియాలు ఆ తర్వాత రకరకాల గాజులు వచ్చాయి. ఒక పునిస్త్రీ ఆడబడుచు యింట్లో తిరుగుతూంటే గలగలమంటూ కలకల్లాడుతూ వుండాలని మనవాళ్ళ అభిలాష! మెళ్ళోకి చంద్రహారాలు, కంటె, కాసులపేర్లూ యింకా పగడాలు, జిగినీ గొలుసులూ, ముత్యాలహారాలు, చేతికి దండ కడియం యివన్నీ తెలుగింటి ఆడబడుచుకి (కలవారి కోడలు కలికి కామాక్షికి) వుండి తీరవలసిన జవ్వారీ జవ్వరాను. పాపిడి పిందిరాలు చెవులకి కర్ణాభరణాలు పెక్కురకాలుండేవి. ఇవన్నీ గాకపోయినా మా అత్తయ్యగారికి యిందులో కొన్నయినా వుండేవి. ఒడ్డాణ్ణం మస్ట్ - అది వంకీల ఒడ్డాణ్ణం- ఆ ఒడ్డాణ్ణం పెట్టుకొని, ముఖాన పెద్ద కుంకమ బొట్టుతో -(ఏడుగజాల చీరలావిడ కట్టేవారు కాదు) తొమ్మిది గజాల చుట్టంచుజరీ చీరతో కచ్చా పోసి కట్టుకుని పెద్ద పమిటను ముందుకు లాగి ఆవిడ యింట్లో తిరుగుతూంటే మహాలక్ష్మి కళ నట్టింట నడయాడుతున్నట్లు ఉండేది.

ఆవిడ సంపదతో తరలివచ్చిన యిల్లాలు గనుక - ఆవిడది చాలా భారీ చెయ్యి. ఎవరికి ఏది కావాలని వచ్చిచేయి చాచినా లేదనేది లేదు. దానం, దయ, క్షమ, ప్రేమ, భక్తి